క్లుప్తంగా

శాకంబరి అలంకరణలో అమ్మవారు



పొదలకూరు: మండలంలోని మరుపూరు శ్రీకామాక్షి సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో శుక్రవారం అమ్మవారు శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం చివరి శుక్రవారం కావడంతో భక్తులు అమ్మవారిని కూరగాయలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

'డీకేడబ్ల్యూ'లో సాహితీ సదస్సు



నెల్లూరు (టౌన్): తెలుగు సాహిత్యం – ఒక పరిశీలనపై అనే అంశంపై నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో సాహితీ సదస్సును కేంద్ర సాహిత్య అకాడమీ, అభ్యుదయ రచయితల సంఘ నెల్లూరు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. సాహితీ అంశాలపై పలువురు అవగాహన కల్పించారు. అరసం ఉపాధ్యక్షులు రామకృష్ణ, వెంకటప్పయ్య, పెరుగు రామకృష్ణ, గంగిశెట్టి శివకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కరుణశ్రీ, తెలుగు, హిందీ ఆచార్యులు సత్యనారాయణ, సురేంద్ర, వైస్ ప్రిన్సిపల్ రమణరావు, రచయితలు, సుబ్రహ్మణ్యం, రాజేంద్రసింగ్, నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ నూతన కార్యవర్గ ఎన్నిక



నెల్లూరు (టౌన్): హరనాథపురంలోని జెట్టి శేషారెడ్డి కల్యాణ మండపంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా తోడేటి విక్రమ్, కార్యదర్శిగా వెన్ను నరేంద్ర, ఉపాధ్యక్షులుగా దేవేంద్ర, నానీ, జిల్లా సహాయ కార్యదర్శులుగా వంశీ, లోకేష్, కమిటీ సభ్యులుగా యగ్నేష్, దివేశ్, అమర్, ప్రవీణ్, నాగ్రేంద్ర, విష్ణు ఎన్నికయ్యారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకుల రెన్యువల్

నెల్లూరు (టౌన్): గత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేసిన కాంట్రాక్ట్ అధ్యాపకులను ఈ విద్యా సంవత్సరానికి రెన్యూవల్ చేశారని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గిరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు, సంబంధిత వివరాలు, అర్హత ధ్రువీకరణ పత్రాలను జతచేసి సంబంధిత కళాశాలల ప్రిన్సిపల్స్‌కు సోమవారంలోపు అందజేయాలని కోరారు.

కబడ్డీ పోటీలకు ఎంపికలు రేపు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): యువాంధ్ర కబడ్డీ పోటీలకు సంబంధించిన ఎంపికలను నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించనున్నామని కబడ్డీ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ సతీష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు తమ ఆధార్ కార్డుతో హాజరుకావాలని కోరారు.

సాధారణ సర్వసభ్య సమావేశం నేడు

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని నగరంలోని రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం నిర్వహించనున్నామని ఎంపీడీఓ శైలేంద్రకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు సమస్యలు, అభివృద్ధి పనులపై చర్చించనున్నామని వివరించారు.

సిలిండర్‌పై అదనంగా వసూలు చేస్తే చర్యలు

నెల్లూరు (పొగతోట): గ్యాస్ సిలిండర్‌పై అధికంగా వసూలు చేస్తే సంబంధిత ఏజెన్సీలపై కేసులు నమోదు చేస్తామని జేసీ కార్తీక్ స్పష్టం చేశారు. నగరంలోని డీఆర్డీఏ సమావేశ మందిరంలో సీఎస్డీటీలు, గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మార్పీ కంటే అధికంగా వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులొస్తున్నాయని, ఇలా వ్యవహరిస్తే సహించేదిలేదని చెప్పారు. డీఎస్‌ఓ విజయ్‌కుమార్, ఏఎస్‌ఓలు అంకయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో కంటి విభాగం మూత



పొదలకూరు సీహెచ్‌సీ

- అపోలో కాంట్రాక్ట్ పూర్తి
- అద్దాల కోసం పేదల ఇబ్బందులు

పొదలకూరు: పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో కంటి విభాగం తలుపులు తెరుచుకోవడం లేదు. పదినెలలుగా ఆప్తాలమిస్ట్ ఇక్కడకు రావడం లేదు. గత ప్రభుత్వంలో ఐదేళ్లు ఇక్కడ చుట్టుపక్కల మండలాలకు చెందిన వేలాది మంది రోగులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలు అందజేశారు. ఇందుకోసం అపోలో హాస్పిటల్ వారికి కాంట్రాక్ట్ అప్పగించారు. అయితే ప్రస్తుతం కాంట్రాక్ట్ సమయం పూర్తి కావడంతో సీహెచ్‌సీలో కంటి విభాగాన్ని తాత్కాలికంగా మూసివేశారు. ఫలితంగా ప్రతినిత్యం వైద్య పరీక్షలు, అద్దాల కోసం వచ్చేవారు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు ఇక్కడ కంటి పరీక్షలు ఉచితంగా చేయించుకుని అద్దాలు పొందేవారు. చేజర్ల, కలువాయి, సైదాపురం మండలాల నుంచి కూడా సీహెచ్‌సీకి వచ్చేవారు.

టెండర్లు నిర్వహిస్తేనే..

కంటి విభాగం తలుపులు తెరుచుకుని పేదలకు వైద్యం అందాలంటే ప్రభుత్వం టెండర్లను నిర్వహించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు అపోలో వారు టెండర్ల కాంట్రాక్టు దక్కించుకుని అద్దాలు అందజేశారు. అయితే ప్రభుత్వం టెండర్లను నిర్వహించి తిరిగి ఆ విభాగాన్ని పునరుద్ధరించాల్సి ఉంటుంది. దీనిపై ఎంత సమయం తీసుకుంటుందో స్పష్టత లేదంటున్నారు. ఈలోగా అద్దాలు అవసరమైన వారు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సి ఉంటుంది. ఈ విషయమై సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ యు.ప్రసాద్ మాట్లాడుతూ అపోలో కాంట్రాక్ట్ పూర్తి కావడంతో అద్దాల పంపిణీ నిలిచిపోయిందన్నారు. తిరిగి టెండర్లు నిర్వహించి థర్డ్ పార్టీకి అప్పగిస్తే పరీక్షలు నిర్వహించి అద్దాలు పంపిణీ కార్యక్రమం పునరుద్ధరించడం జరుగుతుందన్నారు.



తలుపులు మూసిన కంటి విభాగం

కలగానే రహదారి మరమ్మతులు



గుంతలమయంగా మండపం రహదారి

తోటపల్లిగూడూరు: దారుణంగా మారిన మండపం రహదారి మరమ్మతుల విషయంలో కూటమి పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఫలితంగా వాహనదారులు ఇబ్బందుల నడుమ రాకపోకలు సాగించాల్సి వస్తోంది. మండలంలోని సౌలిపేట సెంటర్ నుంచి కాటేపల్లి బీచ్‌కు వెళ్లే మార్గంలో చంద్రశేఖరపురం నుంచి మండపం గ్రామం వస్తుంది. చంద్రశేఖరపురం నుంచి మండపం గ్రామానికి దాదాపు రెండు కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఈ రహదారిలో గతంలో ఏర్పాటు చేసిన బీటీ రోడ్డు నేడు అధ్వానంగా ఉంది. కంకర లేచి గుంతలమయంగా మారిన ఈ రోడ్డుపై ప్రయాణించలేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండపం బీటీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదు. నిధులు మంజూరు చేశామని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని కూటమి ప్రభుత్వ పెద్దలు కొంతకాలంగా చెబుతున్నా ఇంకా కార్యరూపం దాల్చలేదు.

గ్రామ సింహాలు.. బెంబేలెత్తుతున్న జనం

పొదలకూరు: పట్టణంలో, గ్రామాల్లో వీధి కుక్కలు దాడులు చేస్తూ ప్రజల్ని బెంబేలెత్తిస్తున్నాయి. సాధారణంగా కుక్కలకు సూదిమందు ద్వారా సంతానోత్పత్తిని లేకుండా చేస్తుంటారు. కొన్ని సందర్భాల్లో పెంపుడు కుక్కలు సైతం అకస్మాత్తుగా మనుషులపై దాడులు చేసి గాయపరుస్తున్నాయి. పొదలకూరు పట్టణంలో గ్రామ సింహాలు వందల సంఖ్యలో ఉన్నాయి. గతేడాది పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. పంచాయతీ సిబ్బంది చొరవ తీసుకుని దానిని కొట్టి చంపారు. శునకాల సంఖ్య బాగా పెరగడంతో వేగలేకున్నామని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో రాత్రివేళల్లో చిన్నపిల్లలను కాటువేస్తున్నాయి. కుక్కలను పట్టించాలంటే పంచాయతీలకు తలనొప్పిగా మారిందంటున్నారు. స్థానిక సీహెచ్‌సీలో కుక్కకాటు మందు (ఏఆర్‌వీ) అందుబాటులో ఉంది. నిత్యం ఏదో ఒక గ్రామం నుంచి కుక్కకాటుకు గురైన వారు ఆస్పత్రికి వచ్చి ఏఆర్‌వీ చేయించుకుంటున్నట్టు వైద్యులు వెల్లడించారు.



వీధుల్లో స్వైరవిహారం చేస్తున్న శునకాలు

కుక్కలతో వేగలేకున్నాం



పట్టణంలో కుక్కలతో వేగలేకున్నాం. వీధి కుక్కల స్వైర విహారంతో రాత్రి వేళల్లో వీధుల్లో తిరగాలంటే ఇబ్బందిగా మారింది. అధికారులు వాటిని పట్టించి ఊరికి దూరంగా వదిలితే మంచిది.

– కాళిదాస్, స్థానికుడు, పొదలకూరు

టిడ్కోకు మొగళ్లూరు తిప్ప

- అధికారుల ప్రతిపాదనలు

పొదలకూరు: మండలంలోని మొగళ్లూరు సిద్ధలయ్య తిప్పను టిడ్కో (టౌన్‌షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్)కు కేటాయించేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. టిడ్కో ఇళ్లను నిర్మించేందుకు సుమారు 100 ఎకరాలను కేటాయించేందుకు అధికారులు తిప్పను పరిశీలించి వెళ్లారు. సర్వే నంబర్ 268లో తిప్ప పోరంబోకు భూమి 218.40 ఎకరాలు ఉంది. ఈ ప్రాంతంలో అసైన్డ్ భూములు, పేదలు చదును చేసుకుని నిమ్మతోటలు సాగు చేసుకుంటున్నా పొలం మిగిలింది కలిపి 128.10 ఎకరాలున్నట్టు తహసీల్దార్ బి.శివకృష్ణయ్య వెల్లడించారు. ఈ నేపథ్యంలో 100 ఎకరాలను టిడ్కోకు కేటాయించేందుకు నివేదిక పంపాల్సిందిగా ఉన్నత స్థాయి అధికారుల నుంచి ఆదేశాలందాయి. తహసీల్దార్ ఆ మేరకు చర్యలు తీసుకున్నారు. అయితే సిద్ధలయ్య తిప్ప ఇళ్లు నిర్మించేందుకు అనుకూలంగా ఉంటుందా? అనే సందేహాలున్నాయి. కొండపై సిద్ధలయ్య (శివయ్య) దేవస్థానం ఉంది. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు వచ్చి వెళుతుంటారు. ముందుగా కొండను పర్యాటక కేంద్రంగా రూపొందించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు పూనుకున్నారు. అయితే పర్యాటక శాఖ అధికారులు పరిశీలించి విముఖత వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో టిడ్కో ఇళ్లకు ఈ ప్రాంతాన్ని కేటాయిస్తే బాగుంటుందని అధికారులు భావించి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: ఆటో అదుపుతప్పి బోల్తా పడి ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని గొలగమూడి సమీపంలో శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన వెంకటేశ్వర్లు పని నిమిత్తం ఆటోలో గొలగమూడికి వచ్చాడు. తిరిగి బుచ్చిరెడ్డిపాళేనికి వెళుతుండగా సర్వేపల్లి కాలువ సమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వెంకటేశ్వర్లు గాయపడగా స్థానికులు చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

చాముండేశ్వరికి శాకంబరి అలంకారం రేపు

ఇందుకూరుపేట: గంగపట్నంలో కొలువైన చాముండేశ్వరిదేవి అమ్మవారు శాకంబరి అలంకారంలో ఆదివారం దర్శనమివ్వనున్నారని ఈఓ తాతా శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.

కుటుంబసభ్యులకు బాలిక అప్పగింత

కలువాయి(సైదాపురం): తప్పిపోయిన బాలికను గుర్తించి తండ్రికి అప్పగించిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. కలువాయికి చెందిన చంద్ర అనే వ్యక్తికి వివాహమై కుమార్తె ఉంది. భార్య వదిలి వెళ్లిపోవడంతో అతను ఇందుకూరుపేటలో మరో వివాహం చేసుకుని అక్కడే నివాసం ఉంటున్నాడు. కాగా బాలికకు మతిస్థిమితం సక్రమంగా లేదు. ఈనెల 16వ తేదీన రైలెక్కి తిరుపతికి వెళ్లిపోయింది. రైల్వేస్టేషన్‌లో పోలీసులు గుర్తించి వివరాలు తెలుసుకున్నారు. కలువాయి ఎస్సై కోటయ్యకు సమాచారం అందించారు. ఆయన చంద్రను స్టేషన్‌కు పిలిపించి ఐసీడీఎస్ అధికారుల ఆధ్వర్యంలో బాలికను అప్పగించారు.

హెచ్చరిక బోర్డులేవీ..?



పొలిచెర్లపాడుకు వెళ్లే మార్గంలో..

వెంకటాచలం: మండలంలోని కసుమూరు నుంచి పొలిచెర్లపాడు గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కసుమూరు నుంచి పొలిచెర్లపాడుకు 3 కిలోమీటర్లు దూరం ఉండగా నాలుగు చోట్ల మలుపులున్నాయి. అయితే మలుపు రోడ్డు వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయకుండా వదిలేశారు. కొత్తగా వచ్చే ప్రయాణికులు మలుపుల గురించి తెలియక ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

రీ సర్వే పరిశీలన

ఇందుకూరుపేట: మండలంలోని గంగపట్నంలో నిర్వహిస్తున్న రీ సర్వేను డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ సత్యనారాయణరెడ్డి శుక్రవారం పరిశీలించారు. సర్వేకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. గ్రామ సర్వేయర్లు, రైతులతో మాట్లాడారు. మండల సర్వేయర్ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.



పంటకాలువ ఆక్రమణ అడ్డగింత

మనుబోలు: మండల కేంద్రంలో పంటకాలువను ఆక్రమించి చేపట్టిన ఇంటి నిర్మాణాన్ని రైతులు శుక్రవారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనుబోలు చెరువు నుంచి పొలాలకు సాగునీరు సరఫరా అయ్యే పంట కాలువను గుడితూము వద్ద స్థానిక దళితవాడకు చెందిన ఓ వ్యక్తి ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపట్టాడని ఆరోపించారు. ఈ విషయం తెలిసి తాము గతంలోనే సదరు వ్యక్తి చెప్పామన్నారు. కాలువ స్థలానికి దూరంగా నిర్మాణం చేసుకోవాలని సూచించామన్నారు. అయినా వినకుండా పిల్లర్ నిర్మించడంతో అడ్డుకున్నట్లు తెలిపారు. కాలువ ఆక్రమణకు గురైతే రెండు వేల ఎకరాలకు సాగునీటి సరఫరా విషయంలో ఇబ్బందులు తలెత్తుతాయని వెల్లడించారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు స్పందించి ఆక్రమణను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు.



కాలువ ఆక్రమణను అడ్డుకుంటున్న రైతులు

ప్రాచీన కళలను కాపాడుకోవాలి

మనుబోలు: ప్రాచీన కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కూచిపూడి నృత్య గురువు డాక్టర్ డేగల సాంబశివరావు అన్నారు. మనుబోలు మండల కేంద్రంలోని శుశృత, లోటస్ వ్యాలీ పాఠశాలల్లో శుక్రవారం విద్యార్థినులకు కూచిపూడి నృత్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, కళలు, సంప్రదాయాలను నేటితరం మరిచిపోతోందన్నారు. కూచిపూడి, భరతనాట్యం నేర్చుకోవాలని విద్యార్థినులకు సూచించారు. స్కూళ్లలో కూచిపూడి నేర్పించేందుకు తన శిష్యురాలైన పూర్ణిమశ్రీని గురువుగా ఎంపిక చేసుకున్నందుకు అభినందించారు.



సాంబశివరావును సన్మానిస్తున్న పాఠశాల యాజమాన్యం

మధ్యాహ్న భోజన పథక అమలుపై తనిఖీ

కోవూరు: పడుగుపాడు ఉన్నత పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఈఓ రహీం శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థులతో ముచ్చటించి.. భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. హెచ్‌ఎం దివాకర్ తదితరులు పాల్గొన్నారు.



కొనసాగుతున్న కార్మికుల నిరసన

నెల్లూరు(బారకాసు): మున్సిపల్ కార్మికుల నిరసన ఆరో రోజు శుక్రవారం కొనసాగింది. ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ నుంచి కేవీఆర్ పెట్రోల్ బంక్ సమీపంలోని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కార్యాలయం వరకు భారీ నిరసన ర్యాలీని చేపట్టారు. అనంతరం ఆయనకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్, నెల్లూరు అధ్యక్షుడు కత్తి శ్రీనివాసులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పెంచలనరసయ్య మాట్లాడారు. న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం కార్మికులు సమ్మె చేస్తున్నా, ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. సీపీఎం నెల్లూరు రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్, సీఐటీయూ నేతలు సూర్యనారాయణ, సుధాకర్, శివాజీ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు మట్టిపాటి శ్రీనివాసులు, రాంబాబు, కిరణ్, లోకేష్, మనోజ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



యాదే రఫీ మ్యూజికల్ నైట్ రేపు

నెల్లూరు(బృందావనం): యాదే రఫీ మ్యూజికల్ నైట్‌ను నగరంలోని పురమందిరంలో ఆదివారం రాత్రి ఏడు గంటలకు నిర్వహించనున్నామని మహమ్మద్ రఫీ కల్చరల్ అకాడమీ అధ్యక్షుడు జావేద్ అహ్మద్ పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను గాయకులు మహబూబ్ బాషా, అమానుల్లాఖాన్, షఫీతో కలిసి పురమందిరంలో శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి తరలిరావాలని కోరారు.



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

గ్రంథాలయానికి నూతన పుస్తకాలు



లైబ్రేరియన్ రాజేశ్వరికి అందజేస్తున్న జేసీ కార్తీక్

కొడవలూరు: స్థానిక గ్రంథాలయానికి నూతన పుస్తకాలను పంపిణీ చేశారు. నెల్లూరు స్టోన్‌హౌస్ పేటలోని కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశానికి గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జ్, జేసీ కార్తీక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కొడవలూరు గ్రంథాలయానికి అవసరమైన నూతన పుస్తకాలను లైబ్రేరియన్ రాజేశ్వరికి అందజేశారు. కొడవలూరు గ్రంథాలయంలో పాఠకుల సంఖ్య గణనీయంగా పెరుగుతుండటం, పోటీ పరీక్షల నిమిత్తం విద్యార్థులు ఆశ్రయిస్తుండటంతో నూతన పుస్తకాల ఆవశ్యకత ఏర్పడింది. ఈ విషయాన్ని జేసీ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించి వీటిని అందజేశారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

కొడవలూరు: దోమల నివారణకు వైద్య శాఖ చర్యలు చేపట్టింది. మండలంలోని రామన్నపాళెం, రెడ్డిపాళెంలో ఇంటింటికీ వైద్య సిబ్బంది శుక్రవారం వెళ్లారు. దోమలు ఉత్పత్తయ్యే తొట్లు, టైర్లను పరిశీలించి అందులో నిల్వ ఉన్న నీటిని తొలగించారు. ఈ సందర్భంగా హెచ్‌ఏ షఫీఉద్దీన్ మాట్లాడారు. డ్రైడే పాటించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా 90 శాతం దోమల ఉత్పత్తిని తగ్గించుకోవచ్చని చెప్పారు. హెచ్‌ఎస్ రామ్మోహన్, ఎమ్మెల్‌హెచ్‌పీ సుష్మ, ఏఎన్‌ఎం నదియా, ఆశ కార్యకర్తలు కిశోరమ్మ, పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.



నిల్వ ఉన్న నీటిని తొలగిస్తున్న వైద్య సిబ్బంది

పెయ్య దూడలతో పాడి రైతులకు లాభం



బహుమతి అందజేస్తున్న అధికారులు

మనుబోలు: పెయ్య దూడలతో పాల ఉత్పత్తి పెరిగి పాడి రైతులకు లాభాలు వస్తాయని మనుబోలు ప్రాంతీయ వైద్యశాల ఏడీ గురవారెడ్డి అన్నారు. మండలంలోని చెర్లోపల్లి రైతు సేవా కేంద్రంలో పెయ్య దూడల అందాల పోటీలను శుక్రవారం నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగ నిర్ధారిత వీర్యం (ఏడీఐపీ) ద్వారా పాడి పశువులకు పెయ్య దూడలు పుట్టేలా చేయొచ్చన్నారు. పశువులకు డీవార్మింగ్, కాల్షియం మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నెల్లూరు డివిజన్ ఏడీ నాగమణి, నాయకులు కలికి వేణుగోపాల్‌రెడ్డి, పొన్నూరు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ముత్తుకూరు(పొదలకూరు): అప్పుల బాధ తాళలేక ఈనెల 16వ తేదీన పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు శుక్రవారం మృతిచెందాడు. ఎస్సై విశ్వనాథ్‌రెడ్డి కథనం మేరకు.. మండలంలోని పొట్టెంపాడు గ్రామానికి చెందిన హరేంద్రరెడ్డి అప్పులపాలయ్యాడు. డబ్బులు ఇచ్చిన వారి నుంచి ఒత్తిడి అధికం కావడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.



హరేంద్రరెడ్డి మృతదేహం